వైసీపీ ప్రభుత్వంలో స్వయం సహాయక సంఘాలను భ్రష్టు పట్టించారు. గుడివాడలో ఫేక్ గ్రూపులను సృష్టించి క్విడ్‌ప్రోకోకు పాల్పడ్డారు. అక్రమంగా రుణాలను పొందారు. రెండేళ్లుగా ఈ తతంగం సాగుతున్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాకుండా కొందరు ఆర్పీలు, సీవోలు జాగ్రత్తపడ్డారు. కొన్ని బ్యాంకుల మేనేజర్లు కూడా ఈ అక్రమంలో పాత్రధారులుగా ఉన్నట్టు చర్చ నడుస్తోంది. అందరూ కలిసి రూ.10 కోట్లకుపైనే దోచేసినట్టు తెలుస్తోంది.



గుడివాడ పురపాలక సంఘం కార్యాలయం (ఫైల్)

గ్రూపు కట్టి.. రూ. కోట్లు పట్టి..!

ఫేక్ డ్వాక్రా సంఘాల పేరుతో మాయ

గుడివాడలో పాత సభ్యులతోనే కొత్త గ్రూపుల ఏర్పాటు

- సీఎంఎంకు తెలియకుండా రుణాలు
- కొందరు ఆర్పీలు, సీవోల మిలాఖత్
- బ్యాంకుల మేనేజర్లూ పాత్రధారులే
- రూ.10కోట్లు పొందినట్టు ప్రచారం
- అక్రమంలో నాని అనుచరుడి పాత్ర

గుడివాడ : సీఎం చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టుల్లో ఒకటి డ్వాక్రా సంఘాలు. ప్రతి మహిళ ఆర్థిక స్వాలంబన సాధించాలని, స్వయం ఉపాధి కల్పించాలని లక్ష్యంతో స్వయం సహాయక గ్రూపులను ఏర్పాటు చేశారు. 10 మంది మహిళలతో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశారు. ప్రతినెలా పొదుపు చేసుకుంటూ ఉంటే వారికి బ్యాంకుల ద్వారా లింకేజీ రుణాలు ఇచ్చేవారు. దీంతో ప్రతి నెలా రుణాల తాలుకు ఈఎంఐలు చెల్లించాలి.

● ఆర్పీలు, సీవోల కుమ్మక్కు

డ్వాక్రా రిసోర్స్ పర్సన్‌ల ద్వారా ప్రతి స్వయం సహాయక గ్రూపునకు రుణ దరఖాస్తులు సీవోలకు ఇవ్వాలి. ఆజమాయిషీ అంతా సీవోల చేతుల్లో ఉంటుంది. రుణం పొందే ప్రతి డ్వాక్రా మహిళ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. సీవోల ద్వారా సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్) వద్దకు దరఖాస్తు చేరుతుంది. పూర్తిస్థాయి పరిశీలన జరిగిన తరువాతే సీఎంఎం అనుమతితో బ్యాంకుకు దరఖాస్తు చేరుతుంది. బ్యాంకర్లు రుణాలను అందజేస్తారు. ఇది స్వతహాగా జరుగుతూ ఉండే ప్రక్రియ. అయితే ఆర్పీలు, సీవోలు కుమ్మకై దోపిడీకి తెరలేపారు. సీఎంఎంతో ప్రమేయం లేకుండానే బ్యాంకర్లతో కుమ్మకై రుణాలు ఇప్పించేశారు. క్విడ్‌ప్రోకో తరహాలో నగదు చేతులు మారి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఆర్పీలు, సీవోలు కుమ్మకై కొత్త గ్రూపుల పేరుతో భారీస్థాయిలో రుణాలు పక్కదారి పట్టించారని కార్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి.

● ఫేక్ గ్రూపులు సృష్టించి అక్రమం

పట్టణంలో ఇప్పటికే వందలాది స్వయం సహాయక గ్రూపులు నడుస్తున్నాయి. దాదాపుగా అందరి వివరాలు ఆన్‌లైన్ చేశారు. గతంలో ఉన్న గ్రూపు సభ్యులతోనే కొత్త ఫేక్ గ్రూపులను సృష్టించారు. కొత్త గ్రూపుల్లోని సభ్యుల వివరాలను ఆన్‌లైన్ చేయలేదు. ఆర్పీలు, సీవోలు కుమ్మకై బ్యాంకు మేనేజర్‌లతో మిలాఖత్ అయి రుణాలు విడుదల చేయించారు. చాకచక్యంగా రుణాలను కొట్టేశారు. ఆర్పీలు, సీవోలు, బ్యాంకు మేనేజర్‌లతో సహా ఎవరి వాటాలు వారికి అందాయి. పట్టణ వ్యాప్తంగా సుమారు 50 ఫేక్ గ్రూపులను సృష్టించి, రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల మేర బ్యాంకుల నుంచి రుణాలను పక్కదారి పట్టించి ఉంటారని స్వయం సహాయక సభ్యులు తెలుపుతున్నారు. ఇంతపెద్ద స్కాం వెనుక కొందరు వైసీపీ నాయకులు ఉన్నారని గుసగుసలు వినవస్తున్నాయి.

● ఎవరి పాత్ర ఎంత?

డ్వాక్రాలో భారీస్థాయిలో స్కాం చేయడానికి అప్పటి వైసీపీ నాయకులు హస్తంతోనే ఆర్పీలు, సీవోలు పెట్రేగిపోయారని వినికిడి. ముఖ్యంగా మున్సిపాలిటీని ఐదేళ్లపాటు తన గుప్పెట్లో పెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ముఖ్య అనుచరుడు ఒకరు, కొందరు వైసీపీ మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జుల పాత్ర ఉన్నట్టు జోరుగా ప్రచారం సాగుతోంది. పట్టణ సమాఖ్యకు స్కాం విషయం పూర్తిగా తెలుసని, సమాఖ్యలోని కొందరికి ఈ స్కాంలో పాత్ర ఉందని స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ స్కాంలో ఆర్పీలు, సీవోలు, బ్యాంకర్‌ల పాత్ర ఉన్నట్టు స్పష్టమైంది. ఎవరు ఎంత మేర దోచేశారో తెలియాలంటే పూర్తిస్థాయి విచారణ జరగాల్సి ఉంది.



రెండేళ్లుగా సీఎంఎంకు తెలియకుండా కొత్త గ్రూపులకు భారీ మొత్తంలో రుణాలిచ్చినట్టు సమాచారం. వేరే గ్రూపుల్లోని సభ్యులను పెట్టి కొత్త గ్రూపుగా చూపించి అక్రమంగా రుణానికి దరఖాస్తు చేసుకున్నట్టు సీఎంఎంకు అజ్ఞాత వ్యక్తి సమాచారం అందించారు. తనకు తెలియకుండానే కొత్త గ్రూపు ఎప్పుడు పెట్టారని, తాను సంతకాలు చేయకుండానే రుణానికి ఎలా దరఖాస్తు చేశారు? అని ఆమె అవాక్కయ్యారు. దీంతో స్థానిక ఇండియన్ బ్యాంకులో పరిశీలించగా, కొత్త గ్రూపు రుణానికి దరఖాస్తు వచ్చినట్టు గుర్తించారు. పరిశీలించి చూడగా గ్రూపుల్లో ఉన్న సభ్యులు కొందరు గతంలోనే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో డ్వాక్రా రుణాలు పొందినట్టు గ్రహించారు. వెంటనే రుణాన్ని నిలుపుదల చేసి విచారణ చేపట్టారు. మరో బ్యాంకులో కూడా ఇదే తరహాలో రుణాలకు దరఖాస్తు చేసినట్టు గమనించి నిలుపుదల చేశారు. సదరు విషయాన్ని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. తన ప్రమేయం లేకుండానే కొందరు ఆర్పీలు, కొందరు సీవోలతో కలిసి ఈ తరహా మోసానికి పాల్పడుతున్నట్టు గ్రహించారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి నిజాలను నిగ్గు తేలుస్తానని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపడతామని సీఎంఎం సుజాత తెలిపారు.

జిల్లాలో తహసీల్దార్ల సర్దుబాటుకు రంగం సిద్ధమైంది. ఇక్కడ పనిచేస్తున్న 29 మందిని రిలీవ్ చేస్తూ కలెక్టర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ముగ్గురు తహసీల్దార్లను రిలీవ్ చేసేందుకు ఫైలు సిద్ధం చేశారు. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామరాజు, కోనసీమ అంబేద్కర్ తదితర జిల్లాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లను కూడా ఆయా జిల్లాల కలెక్టర్లు రిలీవ్ చేశారు. వీరిలో కొంతమంది సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి డీఆర్వో కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. మంగళ, బుధవారాల్లో ఇతర జిల్లాల నుంచి రిలీవ్ అయిన తహసీల్దార్లు కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేయనున్నారు. ఈ ప్రక్రియ తర్వాత తహసీల్దార్లను సీసీఎల్‌ఏ నిబంధనలకు అనుగుణంగా ఆయా మండలాలకు సర్దుబాటు చేస్తారు.

రేపటిలోగా కొలిక్కి..

తహసీల్దార్ల సర్దుబాటుకు సిద్ధం

- జిల్లా నుంచి 29 మంది రిలీవ్
- మరో ముగ్గురుని రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు సీసీఎల్‌ఏ అనుమతులతో తిరిగి జిల్లాకు వచ్చారు. వీరికి ఆయా మండలాలను కేటాయించే సమయానికి ముందుగానే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల శాసనసభ్యుల వద్దకు వెళ్లి వివిధ మార్గాల్లో సిఫార్సు లేఖలను తెచ్చుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి రిపోర్ట్ చేసిన తహసీల్దార్లు కొందరు శాసనసభ్యులు ఇచ్చిన సిఫార్సు లేఖలతోపాటు తాము జిల్లాకు వచ్చినట్టు రిపోర్ట్ చేశామని చెబుతున్నారు. తహసీల్దార్లు బదిలీల కోసం శాసనసభ్యుల వద్దకు వెళ్లినప్పుడు, సిఫార్సు లేఖలు ఇచ్చే సమయంలో సంబంధిత అధికారుల పనితీరు, సామర్థ్యాన్ని బట్టి ఎంపిక చేసుకుని మరీ లేఖలు ఇచ్చినట్టు రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఎవరికి ఏ మండలాన్ని కేటాయిస్తారనే అంశంపై తుది జాబితా విడుదలయ్యే వరకు ఏం చెప్పలేమని తహసీల్దార్లు చెప్పుకుంటున్నారు.

ముఖ్య కేంద్రాల్లో పోస్టింగ్‌లు ఎవరికో?

మచిలీపట్నం నియోజకవర్గంలో ఉత్తర, దక్షిణ మండలాల తహసీల్దార్ కార్యాలయాలున్నాయి. వీటిలో ఒక తహసీల్దార్ కార్యాలయం పూర్తిస్థాయిలో ఏర్పడలేదు. కార్యాలయ భవనం, సరిపడినంత మంది సిబ్బందిని ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. ప్రొటోకాల్ విధులు అధికంగా ఉండే జిల్లా కేంద్రమైన మచిలీపట్నం తహసీల్దార్లుగా వచ్చేందుకు ఎవరూ ముందుకురాని పరిస్థితి నెలకొంది. తహసీల్దార్లను నియమించకపోతే ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న డిప్యూటీ తహసీల్దార్ ఆ పోస్టులో కొనసాగుతారనే ప్రచారం సాగుతోంది. గన్నవరం నియోజకవర్గంలోని గన్నవరం, బాపులపాడు మండలాలకు తహసీల్దార్లుగా వెళ్లేందుకు ఎవరూ ముందుకు రావటం లేదని రెవెన్యూ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ జరిగిన భూ వివాదాలు తమ తలకు చుట్టుకుంటాయనే ముందుకు రావటంలేదని రెవెన్యూవర్గాలు చెప్పుకుంటున్నాయి. పెడన నియోజకవర్గం లోని కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాలకు తహసీల్దార్లను నియమించే విషయంలో మాజీమంత్రి జోక్యం ఉందనే విషయం బయటకు రావటంతో ఈ మండలాలకు తహసీల్దార్లను పంపే అంశంపై జిల్లా ఉన్నతాధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. పెనమలూరు, గుడివాడ, నందివాడ, కోడూరు, ఘంటసాల మండలాల కోసం కొందరు ప్రయత్నాలు చేసుకున్నారు.

ఆర్డీవోలకూ బదిలీలు?

తహసీల్దార్ల సర్దుబాటు అనంతరం ఆర్డీవోల బదిలీలు ఉంటాయని రెవెన్యూ వర్గాలు, కూటమి నాయకులు చెప్పుకుంటున్నారు. ఆర్డీవోలకు సంబంధించిన బదిలీలు ప్రభుత్వమే చూసుకోవడంతో జిల్లాలోని మూడు డివిజన్‌లకు ఆర్డీవోలుగా ఎవరిని నియమిస్తారనే అంశంపై చర్చ జరుగుతోంది. మచిలీపట్నం ఆర్డీవోగా గతంలో పనిచేసిన అధికారే మళ్లీ పోస్టింగ్ కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారని రెవెన్యూ ఉద్యోగుల మధ్య చర్చ జరుగుతోంది. మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో పలు అక్రమ కార్యకలాపాలకు పాల్పడి గత రెండు సంవత్సరాలుగా వివాదాస్పదుడిగా మారిన ఓ అధికారి తాను మంత్రి పీఏగా వెళుతున్నానని ప్రచారం చేసుకుంటుండటంతో రెవెన్యూ వర్గాల్లో ఈ అంశంపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే కూటమి నాయకులు సంబంధిత అధికారిని పీఏగా తీసుకోవద్దని సూచించినట్లు సమాచారం. గుడివాడ ఆర్డీవో కూడా బదిలీ అయ్యే అవకాశాలు ఉన్నాయని చర్చ నడుస్తోంది.




బడి పిల్లలతో కలెక్టర్ భోజనం

అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును కలెక్టర్ పరిశీలించారు. కొంతమంది విద్యార్థులు ఇంటి వద్ద నుంచే క్యారేజీల్లో భోజనం తీసుకువచ్చి తినటం చూసి కారణాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలోని కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. ఆయనతోపాటు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎండీవో ఉన్నారు. - అవనిగడ్డ

ముగ్గురు మాయగాళ్లు!

రైల్వేలో అక్రమ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ఏడాదిన్నరగా బెజవాడ రైల్వేస్టేషన్‌ను ఆసరాగా చేసుకుని ముగ్గురితో కూడిన మాఫియా రెచ్చిపోతోంది. రైల్వే ఆదాయానికి గండి కొడుతోంది. తమకు లైసెన్స్ ఉందని నమ్మించి రైళ్లలో ఎలక్ట్రానిక్స్ గాడ్జెట్స్ - యాక్సెసరీస్ అమ్ముకునే వారి నుంచి ఓ ప్రైవేటు బ్యాచ్ లక్షలు ఆర్జిస్తోంది. ఇలా ఏడాదికి రూ.కోటికిపైగానే రైల్వేకు కుచ్చుటోపీ పెడుతోంది. ఈ వ్యవహారంలో రైల్వే అధికారుల హస్తం కూడా ఉంది. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీలలో కూడా కొందరు ఈ మాఫియాకు సహకరించటంతో ఏడాదిన్నరగా ఈ అక్రమం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.



రైల్వే ఆదాయానికి గండి కొడుతున్న అక్రమార్కులు

- లైసెన్స్ లేకుండా వసూళ్లు
- స్టేషన్‌లో ఆగి ఉన్న రైళ్లలో గాడ్జెట్స్ అమ్ముకునే వారి నుంచి పిండేస్తున్నవైనం
- ఏడాదికి రూ.2 కోట్లకుపైనే దోపిడీ
- టెండర్లు పిలవకుండా దందా
- రైల్వే అధికారుల హస్తం లేకుండా అసాధ్యం
- పేర్లతో సహా వెల్లడించిన గాడ్జెట్స్ సేల్స్ బాయ్స్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రైల్వేస్టేషన్ కేంద్రంగా ఆగి ఉన్న రైళ్లలో ప్రయాణికులకు ఎలక్ట్రానిక్స్ గాడ్జెట్స్ - యాక్సెసరీస్ అమ్ముకోవటానికి పూర్వం పనిచేసిన కమర్షియల్ బాస్ ఒకరు అనుమతి ఇచ్చారు. అప్పట్లో అధికారికంగానే ఇచ్చారు. ఏడాదిన్నర కిందటే దాని గడువు అయిపోయింది. రైల్వే అధికారులు ఎలాంటి టెండర్లూ పిలవలేదు. కానీ, తమకు లైసెన్స్ ఉందన్న పేరుతో ఓ ప్రైవేటు మాఫియా తమ గుప్పెట్లోకి తీసుకుంది. గతంలో అనుమతులు పొందిన సంస్థ పరిధిలో గ్యాడ్జెట్స్, యాక్సెసరీస్ అమ్ముకునేవారికి తాము లైసెన్స్ తెచ్చుకున్నామని చెప్పి వారి నుంచి గతంలో కట్టించుకున్న విధంగా అనధికారికంగా డబ్బులు వసూలు చేయటం ప్రారంభించారు. ఈ తంతు ఏడాదిన్నరగా సాగుతోంది. దీనిపై ఆంధ్రజ్యోతి బృందం పరిశీలనలో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి.

ఏడాదికి రూ.2 కోట్ల దోపిడీ

రైల్వేస్టేషన్ కేంద్రంగా 150 మందికిపైగా గ్యాడ్జెట్స్ - యాక్సెసరీస్ విక్రయించేవారు ఉన్నారు. వీరంతా ప్రైవేటు వ్యక్తులకు రోజువారీగా డబ్బులు చెల్లిస్తున్నారు. కొంతమంది నెలవారీగా కూడా డబ్బులు చెల్లిస్తున్నారు. రోజుకు కనిష్టంగా రూ.250 చొప్పున ప్రైవేటు మాఫియాకు కట్టాలి. ఇంకా ఎక్కువ మొత్తంలో కట్టేవారు కూడా ఉన్నారు. రోజుకు 150 మంది చెల్లించే మొత్తం రూ.37,500. అంటే నెలకు రూ.11,25,000. అదే ఏడాదికి మొత్తం రూ.1.35 కోట్లు. ఏడాదిన్నగా సాగిస్తుండటం వల్ల దాదాపుగా ఇప్పటి వరకు రూ.2 కోట్ల పైమాటే ప్రైవేటు మాఫియా పిండేసింది.



● ముగ్గురు కలిసి మాఫియా

రైల్వేలో గ్యాడ్జెట్స్ - యాక్సెసరీస్ విక్రయించేవారితో లైసెన్స్ పేరుతో డబ్బులు కట్టించుకుంటున్నారు. చాలా మందికి లైసెన్స్ ఉన్న విషయం తెలియదు. రైళ్లలో అమ్మినా, అమ్ముకోకపోయినా మాఫియాకు డబ్బులు కట్టాల్సిందే. జ్వరం వచ్చి రాలేకపోయినా వారికి సంబంధం ఉండదు. ఒక్కసారి వారి దగ్గర పేరు రిజిస్టర్ అయితే డబ్బులు చెల్లించాల్సిందే. డబ్బులు ఎవరికి కడుతున్నారని సమాధానం రాబట్టే ప్రయత్నం చేయగా ముగ్గురి పేర్లు ప్రస్తావించారు. వీరంతా శివ అనే వ్యక్తికి డబ్బులు చెల్లిస్తారు. శివ పైన బాలబొమ్మ శ్రీను ఆజమాయిషీ చేస్తుంటాడు. అలా చివరికి వారి మేనేజర్‌గా శేషయ్య పేరు బయటకొస్తోంది. ఈ ముగ్గురు ఎవరన్నది పరిశీలిస్తే శివ.. జక్కంపూడిలోని వైఎస్ఆర్ కాలనీలో ఉంటాడని తెలుస్తోంది. రైల్వేస్టేషన్‌లో తక్కువగా కనపడే ఈ వ్యక్తి ఠంచనుగా డబ్బులు కట్టించుకుంటాడు. బాలబొమ్మ శ్రీనివాసరావు రైల్వేస్టేషన్ కేంద్రంగా సబ్‌లీజు చేస్తుంటాడు. శేషయ్య పాత కాంట్రాక్టర్ అని తెలిసింది.

విచారణ చేపడితేనే అక్రమార్కులు వెలుగులోకి..

రైల్వేను అడ్డం పెట్టుకుని ప్రైవేటు మాఫియా సంస్థ ఆదాయాన్ని కొల్లగొడుతుంటే.. రైల్వే అధికారులు చోద్యం చూస్తున్నారు. ఈ వ్యవహారంపై గతంలో కూడా రైల్వేస్టేషన్ అధికారులకు ఫిర్యాదులు వచ్చినా.. పై అధికారుల దృష్టికి వెళ్లకుండా జాగ్రత్త పడ్డారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణం రంగంలోకి దిగి సమగ్ర విచారణ చేపడితే అక్రమార్కులు బయటికొస్తారు.

ఇసుక కోసం వైసీపీ నేతల అరాచకం

- కీసర స్టాక్ పాయింట్ వద్ద లారీ డ్రైవర్‌పై కర్రలతో దాడి
- పోలీసుల సమక్షంలోనే దారుణం... అయినా కేసు లేదు

కంచికచర్ల రూరల్, జూలై 29 : కంచికచర్ల మండలం కీసర ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లోడింగ్ విషయంలో స్థానిక వైసీపీ జడ్పీటీసీ భర్త వేల్పుల రమేష్, ఆయన సోదరుడితో కలిసి లారీ డ్రైవర్‌పై కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం ఉదయం జరిగింది. ఇసుక లోడింగ్ కోసం ఆదివారం రాత్రి వచ్చిన లారీలకు సీరియల్‌గా లోడింగ్ కోసం అధికారులు టోకెన్లు జారీ చేశారు. సోమవారం లోడింగ్ జరుగుతుండగా కీసరకు చెందిన వేల్పుల వెంకట్రావ్‌తోపాటు పలువురు ట్రాక్టర్ డ్రైవర్లు ముందుగా తమ ట్రాక్టర్లకు లోడ్ చేయాలని లారీలకు అడ్డు పెట్టారు. దీంతో డ్రైవర్ల మధ్య వివాదం పెరిగింది. మాటామాట పెరిగి జడ్పీటీసీ భర్త వేల్పుల రమేష్ అతని సోదరుడు వేల్పుల వెంకట్రావ్ మరికొంత మందితో కలిసి లారీ డ్రైవర్‌ను చితకబాదారు. ఎస్సై హైమావతి, డిప్యూటీ తహసీల్దార్ నాగుల్ మీరా సమక్షంలో లారీ డ్రైవర్‌పై కర్రలతో దాడి చేయడం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయంపై కంచికచర్ల పోలీసులు కేసు నమోదు చేయకపోవడం శోచనీయం.



లారీ డ్రైవర్‌పై దాడి చేస్తున్న వేల్పుల వెంకట్రావు, రెచ్చగొడుతున్న జడ్పీటీసీ భర్త వేల్పుల రమేష్

పాడిరైతుల సహకారంతో విజయ పథాన..

ప్రభుత్వ ప్రోత్సాహంతో సేవలు విస్తృతం

- 2024-25 ముందస్తు బోనస్ ప్రకటన
- చైర్మన్ చలసాని ఆంజనేయులు

6లో..



వర్గీస్ కురియన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు

విజయవాడ నుంచి మరిన్ని విమాన సర్వీసులు నడపాలి

» కేంద్ర మంత్రికి ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి



రామ్మోహన్ నాయుడితో కేశినేని చిన్ని

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దేశంలోని ముఖ్య పట్టణాలకు విజయవాడ విమానాశ్రయం నుంచి మరిన్ని విమాన సర్వీసులు నడిపేలా కృషి చేయాలని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ సోమవారం ఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడును కలిసి విజ్ఞప్తి చేశారు. విమాన సర్వీసులకు సంబంధించిన ప్రతిపాదనలతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని ఆయనకు అందజేశారు. విజయవాడ నుంచి వారణాసి, కోల్‌కతా, కొచ్చిన్, అహ్మదాబాద్, పూణేలకు సర్వీసులు నడపాల్సిందిగా కోరారు. వారణాసికి విజయవాడ నుంచి నేరుగా విమానానికి ఎంతో డిమాండ్ ఉంటుందని చెప్పారు. కోల్‌కతాకు విజయవాడ నుంచి ప్రారంభించి విశాఖపట్నంను కూడా టచ్ చేసి వెళ్లేలా సర్వీసు నడపాలని కోరారు. విజయవాడ నుంచి కొచ్చిన్‌కు నడిపే విమాన సర్వీసును వయా హైదరాబాద్ మీదుగా కానీ, బెంగళూరుల మీదుగా కానీ నడపాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అమరావతి రాజధానికి తలమానికమైన విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఈ సర్వీసులు ప్రారంభించటం వల్ల ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగం ఉంటుందని చెప్పారు. ఇండిగో సర్వే చేసిన ఈ మార్గాల్లో విమాన సర్వీసులు తక్షణం ప్రారంభించేలా చూడాలని శివనాథ్ కోరారు. దీనికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు.

గిరిజన యువతకు జాబ్‌మేళా రేపు

విజయవాడ లీగల్, జూలై 29 : గిరిజన యువతకు ఉపాధి లక్ష్యంతో జాబ్ మేళాలను నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జి.సృజన తెలిపారు. పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులై ఇంగ్లీషు చదవడం, రాయడంలో నైపుణ్యం గల గిరిజన యువతీ యువకులకు సికింద్రాబాద్‌కు చెందిన ఎస్‌కే సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కెఎల్ గ్రూప్ సౌజన్యంతో జాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్టు ఆమె తెలిపారు. జూలై 31వ తేదీన గొల్లపూడిలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాలో అర్హత కలిగిన గిరిజన యువతకు పికింగ్, ప్యాకింగ్, స్కానింగ్, లోడింగ్ అన్‌లోడింగ్ వంటి ఉద్యోగాలలో అవకాశం కల్పించడం జరుగుతుందని ఆమె తెలిపారు. వారానికి ఐదు రోజులు షిఫ్టుల వారీగా పనిచేయవలసి వుంటుందని, నెలకు రూ.17000 జీతం, పీఎఫ్, ఈఎస్ఐ, మెడికల్ ఇన్సూరెన్సు సౌకర్యంతో పాటు అదనపు పనికి కూడా వేతనం కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల గిరిజన యువత బయోడేటాతో పాటు 10వ తరగతి లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో 31వ తేదీ ఉదయం 10 గంటలకు డీఆర్‌డీఏ కార్యాలయంలో హాజరు కావాలన్నారు. జాబ్‌మేళా కార్యక్రమాన్ని జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి జె.సునీత పర్యవేక్షిస్తారని, ఇతర వివరాలకు 7893751698లో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

కైలే అనిల్ పాస్‌పోర్టు స్వాధీనం చేసుకోవాలి

» ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



పామర్రు, జూలై 29 : తీగ లాగితే డొంక కదిలిందన్న సామెత పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు బాగా వర్తిస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మదనపల్లిసబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల జరిగిన దస్త్రాల దహనం సంఘటన మూలాలు పామర్రు నియోజకవర్గంలో కదలడమే దీనికి ప్రధాన కారణమన్నారు. హైదరాబాద్‌లోనిఅయ్యప్ప సొసైటీలోగల ఆర్‌ఆర్ రెసిడెన్సీలోని 'అనిల్' అపార్టమెంట్‌లో మదనపల్లి రెవెన్యూ ఫైల్స్ దహనంలో ప్రధాన నిందితుడు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి పీఏ శశిధర్ కలిసి ఉండేవారని ఆరోపించారు. శశిధర్‌తో కైలే అనిల్‌కు గల సంబంధాలతో పాటు ఆయన బినామీలపై సమగ్ర దర్యాప్తు జరపాలని సంబంధిత అధికారులను కోరుతున్నట్టు చెప్పారు. హైదరాబాద్, పామర్రు, విజయవాడలోగల మినీలోటస్ పాండ్‌లు, ఇతర కబ్జాల పట్ల సమగ్ర దర్యాప్తు జరిపి, అనిల్ పాస్‌పోర్టును తక్షణం స్వాధీనం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

చైతన్యవంత వీడియోలకు ఆహ్వానం


» సైబర్ నేరాలు, మహిళా భద్రతపై వీడియోల పోటీలు

» ఉత్తమ వీడియోలకు నగదు బహుమతి : సీపీ వెల్లడి

విజయవాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలకు లెక్కే లేదు. టెక్నాలజీ అవసరాలు పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తులతో ఖాతాదారుల సొమ్ములను కొల్లగొట్టేస్తున్నారు. మైనారిటీ తీరకుండా విద్యాసంస్థల్లో ప్రేమాయణం నడుపుతున్నారు. మైనారిటీ తీరని అమ్మాయి అంగీకరించిందని తీసుకెళ్లి లైంగికదాడి కేసుల్లో యువకులు ఇరుక్కుంటున్నారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా, మహిళలు, అమ్మాయిల భద్రతకు సంబంధించి అవగాహన కల్పించే విధంగా వీడియోల రూపకల్పన పోటీలను నిర్వహించాలని పోలీసు అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సీపీ రాజశేఖరబాబు, డీసీపీలు గౌతమీశాలి, టి.హరికృష్ణ, మురళీకృష్ణ నాయుడు, ఏసీపీ స్రవంతిరాయ్, తేజేశ్వరరావులు సోమవారం ఆవిష్కరించారు. ఇందు కోసం రెండు క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. యూట్యూబర్లు, ఇంజనీరింగ్ విద్యార్థులు ఇలా ఎవరైనా ఈ క్యూఆర్ కోడ్లను స్కాన్ చేసుకుని వాటి వివరాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ముందుగా పేరు, వివరాలు రిజిస్టర్ చేసుకుని ఏ అంశంపై వీడియోను రూపొందిస్తారో స్పష్టం చేయాలి. ఇలా చేసిన వీడియోలను క్యూఆర్ కోడ్ చూపించిన లింక్‌ల్లో అప్‌లోడ్ చేయాలి. ఇలా వచ్చిన వీడియోలను అధికారులు ఎంపిక చేస్తారు. ఇందులో మొదటి బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలు అందజేస్తారు.

అర్జీల పరిష్కారంలో స్పష్టత ఉండాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



విజయవాడ లీగల్, జూలై 29 : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్దిష్టమైన స్పష్టతతో అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సృజన, డీఆర్వో వి.శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం జి.వెంకటేశ్వర్లు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, హౌసింగ్ పీడీ రజనీకుమారి తదితరులతో కలిసి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులు సంతృప్తిచెందేలా పారదర్శకంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు అనుమతుల కోసం సమర్పించే దస్త్రాలు (ఫైల్స్) స్పష్టత వుండాలన్నారు. సమీక్షా సమావేశాలకు పూర్తిస్థాయి సమాచారంతో నోట్‌ఫైల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను సిద్ధం చేసుకొని హాజరుకావాలని కలెక్టర్ సృజన అధికారులను ఆదేశించారు.



లైంగిక నేరాల అదుపు.. ప్రతి ఒక్కరి బాధ్యత

కృష్ణలంక, జూలై 29 : లైంగిక వేధింపులను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై అత్యంత కఠినంగా చర్యలు తీసుకొనేందుకు వెనుకాడవద్దని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. లైంగిక వేధింపుల నివారణపై జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'అరవండి' 'పరిగెత్తండి' 'చెప్పండి' నినాదంతో రూపొందించిన గోడ పత్రికలను సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం సృజన మాట్లాడుతూ, బాలికల రక్షణకు హక్కులు, చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై వుందన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నప్పటికీ కొన్నిచోట్ల లైంగిక వేధింపులకు పాల్పడుతున్న సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. లైంగిక నేరాల నుంచి రక్షణకు పోక్సో చట్టాన్ని రూపొందించడం జరిగిందన్నారు. బాలికల రహస్య భాగాలను తాకిన, అసౌకర్యాన్ని, భయాన్ని కలిగించినా 'అరవండి' 'పరిగెత్తండి' 'చెప్పండి' వంటి చర్యల ద్వారా చైతన్యవంతులను చేయాలన్నారు.

సీజనల్ వ్యాధులు కట్టడి చేస్తాం

» 31 నుంచి ఆగస్టు 9 వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

» వ్యాధుల అదుపునకు ప్రత్యేక కార్యాచరణ

» పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపైనా అవగాహన కల్పించండి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా, పాల్గొన్న అధికారులు



విజయవాడ లీగల్, జూలై 29 : ఈనెల 31వ తేదీ నుంచి ఆగస్టు 9 వరకు 10 రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించాలని, సీజనల్ వ్యాధుల కట్టడికి రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ అమలుకు జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ జి.సృజన అన్నారు. సోమవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా, డీఆర్‌ఓ వి.శ్రీనివాసరావులతో కలిసి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్, ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీ, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) తదితరాలపై వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి డివిజన్, మండలస్థాయి అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు. పట్టణ పారిశుధ్యంపై విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంపై డీపీవో ఎన్వీ శివప్రసాద్ యాదవ్, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ సన్నద్ధతపై డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, పిల్లల లైంగిక వేధింపులను అరికట్టేందుకు తీసుకొంటున్న చర్యలపై ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాస్థాయి, మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులతో పాటు ప్రత్యేక అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామీణ ప్రాంతాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ఓహెచ్‌ఎస్ఆర్‌ల క్లీనింగ్, కచ్చా, పక్కా డ్రైన్‌ల క్లీనింగ్, ఫాగింగ్, లైమ్, బ్లీచ్ స్ప్రేయింగ్, మలాథియాన్, బైటెక్స్ ఆయిల్ బాల్స్ స్ప్రేయింగ్, ఘన వ్యర్థాల నిర్వహణ, పైపులైన్ల మరమ్మతులు తదితర కార్యకలాపాలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లోను రోజువారీ పారిశుధ్య కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల అమలుతీరు పర్యవేక్షణకు గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, అంగన్‌వాడీ వర్కర్, ఏఎన్‌ఎంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేయాలన్నారు. ప్రజలు డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల బారినపడకుండా దోమల వ్యాప్తికి మూలకారకాలను నాశనం చేయాలని, ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీరు తాగేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేటు తాగునీటి ప్లాంట్లను కూడా తనిఖీలు చేయాలని ఆదేశించారు.

పెన్షన్ల పంపిణీకి పూర్తి సన్నద్ధత

జూలైలో మాదిరిగానే ఆగస్టులో కూడా ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీని విజయవంతం చేయాలని, తొలిరోజే పూర్తిస్థాయిలో పంపిణీ పూర్తిచేసేలా సన్నద్ధంగా వుండాలన్నారు. మొత్తం 2,34,143 పెన్షన్లకు సంబంధించి రూ.98.80 కోట్ల మేర మొత్తాన్ని ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా లబ్ధిదారులకు ఇంటివద్దే పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా పెన్షన్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చే అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు.బాల్యం-అమూల్యం, పిల్లల రక్షణ మనందరి బాధ్యత, ఈ నేపథ్యంలో పిల్లలపై లైంగిక దాడుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని కలెక్టర్ సృజన సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని, డీఈవో ఎస్వీ సుబ్బారావు, కెఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ జె.సుమన్, జీఎం-డీఐసీ ఎ.సుధాకర్, జిల్లా ఉద్యానవన అధికారి పి.బాలాజీ కుమార్, ఏపీ ఎంఐపీ పీడీ ఎం.సుభానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



మచిలీపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదిక(మీకోసం)కార్యక్రమంలో వచ్చే అర్జీలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించి పరిష్కరించాలని డీఆర్వో కే చంద్రశేఖరరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ పుహాలులో సోమవారం మీకోసం కార్యక్రమంలో భాగంగా ప్రజనుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 130అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ వివిధ శాఖలకు సంబంధించిన బ్యాంకుఖాతాలను సక్రమంగా నిర్వహించకపోవడంతో సదరు ఖాతాలను రిజర్వు బ్యాంకు లాక్‌చేసిందని, ఈ ఖాతాలను పునరుద్ధరించేందుకు అధికారులు తగుచర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులకు సంబంధించి రెండవ విడత గ్రీవెన్స్‌లో 33అర్జీలు రాగా, వాటిలో 21అర్జీలకు పరిష్కారం చూపామని, 12అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. జిల్లాస్థాయిలో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని, వివిధ శాఖలకు సంబంధించిన నివేదికలను ఆగస్టు 3వతేదీలోగా సమాచారశాఖ అధికారికి పంపాలన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర సూచనల మేరకు ప్రతి ఆదివారం మంగినపూడిబీచ్‌లో ఉదయం 6గంటలనుంచి 7గంటలవరకు యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, అందుకు తగిన విధంగా వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనంద్‌కుమార్, డీఈవో తాహెరాసుల్తానా, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీపీవో నాగేశ్వరనాయక్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ జయవర్ధన్, వివిధ శాఖల అధికారులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ సక్రమంగా చేయాలి

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



పింఛన్ల పంపిణీ కార్యక్రమంపై మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జెడ్పీ కన్వెన్షన్‌హాలులో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంపై అధికారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత నెలలో కొన్నిమండలాల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీలో అలసత్వం ప్రదర్శించారని అన్నారు. ఈసారి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. పింఛన్ల పంపిణీకి ముందురోజే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రూట్‌మ్యాప్‌ను రూపొందించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తే సర్వర్‌పై ఒత్తిడి ఉండదని, యాప్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడవన్నారు. గన్నవరం మండలం కొత్తగూడెం సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి కె.పావని ఎనిమిదినెలల గర్భిణి అయినప్పటికీ గతనెలలో ఉదయం 4గంటలకే పింఛన్లు పంపిణీ చేయడం ప్రారంభించి 99శాతం మేర సకాలంలో పూర్తి చేశారని అన్నారు. ఇందుకు సహకరించిన ఎంపీడీవో సత్యకుమార్‌ను, పావనిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో జెడ్పీసీఈవో ఆనంద్‌కుమార్, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ నాగేశ్వర నాయక్, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చేనేత, సహకార సంఘాలకు రూ.11.17 కోట్ల రుణానికి ప్రతిపాదనలు

జిల్లాలోని 25చేనేత సహకారసంఘాలకు కేడీసీసీ బ్యాంకు ద్వారా 2024-25ఆర్థికసంవత్సరంలో రూ.11.17కోట్లను రుణంగా అందజేయాలని కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగిన జిల్లాస్థాయి కమిటీలో తీర్మానం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ పుహాలులో చేనేత,జౌళిశాఖ జిల్లాకమిటీ సమావేశం జరిగింది. గూడూరు మండలంలోని పోలవరం, కప్పలదొడ్డి, రాయవరం, మల్లవోలు, ఐదుగుళ్లపల్లితోపాటు పెడన టౌన్, చల్లపల్లి, గన్నవరంలోని ముస్తాబాద తదితర 25చేనేత సంఘాలకు ఈ రుణాన్ని మంజూరుచేయాలని ప్రతిపాదన చేశారు. ఈ సమావేశంలో చేనేత జౌళిశాఖ ఏడీలు ధనుంజయరావు, రఘునందనరావు, డీసీవో భాస్కరరావు, ఆప్కో విజయవాడ యూనిట్ మార్కెటింగ్ అధికారి ఈఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సహకారంతో విజయ పథాన..

» ప్రభుత్వ ప్రోత్సాహంతో సేవలు విస్తృతం

» 2024-25 ముందస్తు బోనస్ ప్రకటన

» చైర్మన్ చలసాని ఆంజనేయులు



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 29 : పాడిరైతుల సహకారంతోనే కృష్ణా మిల్క్ యూనియన్ విజయపథంలో ముందుకు సాగుతున్నదని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లిలోని కామధేను(విజయ) మిల్క్ ఫ్యాక్టరీ ఆవరణలో సోమవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సర తొలి ముందస్తు బోనస్ రూ.13కోట్లకు పైగా విడుదల చేసి పాడిరైతులకు అందజేయనున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో ఎన్నో ఆటుపోట్లు వచ్చినా పాడిరైతుల అండగా వారి సహకారంతోనే దేశంలోనే అత్యధిక పాలసేకరణ ధర, ముందస్తు బోనస్‌లతో పాటు కళ్యాణమస్తు సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని చైర్మన్ చలసాని తెలిపారు. కూటమి ప్రభుత్వం పాడిరైతులను ప్రోత్సహించేందుకు షెడ్ల నిర్మాణానికి, పచ్చగడ్డి అందుబాటులోకి తెచ్చేందుకు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని పాలకవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. నాలుగు నెలలుగా వర్షాభావ పరిస్థితుల కారణంగా పాల సేకరణ తగ్గినా దాని ప్రభావం రైతుపై పడకుండా పాలకవర్గ సభ్యులు కృషి చేశారని తెలిపారు. క్షీరబంధు పథకాలకు తోడుగా సబ్సిడీపై దాణా అందజేయడంతో పాటు 24గంటలు వెటర్నరీ సర్వీస్(పశువుల వద్దకే వైద్యులు) కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. భవిష్యత్తులో పాలసేకరణ పెరిగేలా ప్రతి సంవత్సరం రూ.3కోట్లకు పైగా వెచ్చించి హైఈల్డింగ్ సెమన్‌ను సబ్సిడీ ధరతో అందజేస్తున్నామని, త్వరలోనే పాలసేకరణలో మంచి ఫలితాలు సాధిస్తామని చైర్మన్ ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోని పాల సొసైటీల ద్వారా సహకార వ్యవస్థను బలోపేతం చేసేలా కీలక నిర్ణయాలు చేయడం, దాని ద్వారా పాడిరైతులకు నేరుగా సంక్షేమపథకాలు అందేలా చర్యలు తీసుకోవడం పట్ల పాలకవర్గ సభ్యులు, చైర్మన్ హర్షం వ్యక్తం చేశారు. కామధేను ఫ్యాక్టరీ స్థాపించినప్పుడే నందమూరి తారక రామారావు ప్రాంగణంగా నామకరణం చేయడం జరిగిందని, అలాగే అన్నదాతల అభివృద్ధికి కృషి చేసిన వర్గీస్ కురియన్ పేరును పాలసేకరణ ట్యాంక్‌బే ప్రాంగణానికి, చెరుకూరి రామోజీరావు పేరును యుటిలిటీస్ ప్రాంగణం నామకరణం చేయడం జరిగిందన్నారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించి ఆయా ప్రాంగణాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పద్య కవయిత్రి ముదిగొండ సీతారావమ్మ కన్నుమూత



సీతారావమ్మ (ఫైల్)

మచిలీపట్నం టౌన్, జూలై 29 : మచిలీపట్నానికి చెందిన ప్రముఖ పద్య కవయిత్రి ముదిగొండ సీతారావమ్మ (76) సోమవారం కన్నుమూశారు. సీతారావమ్మ తన భర్త దివంగత ముదిగొండ నాగమల్లికార్జునరావు నుంచి కవిత్వం రాయడం నేర్చుకున్నారు. పద్య కవితలు రాయడంలో ఎంతో ప్రతిభ ప్రదర్శించేవారు. పరమశివుడిపై ఎన్నో గ్రంథాలు రాశారు. గేయాలు, మినీ కవితలు కూడా రాశారు. అష్టావధానాలు, శతావధానాల్లో పృచ్ఛకులుగా ఉండి దత్తపదులు, నిషిద్ధాక్షరిలో అవధానిని ఉక్కిరిబిక్కిరి చేసేవారు. ఉగాది కవి సమ్మేళనాల్లో పాల్గొని అందరి ప్రశంసలు అందుకునేవారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో సోమవారం ఆమె 'శతకసాహితీ ప్రదీప్తి' ఉత్తమ కవయిత్రి పురస్కారం అందుకోవాల్సి ఉంది. ఈలోగానే సోమవారం మధ్యాహ్నం ఆమె పరమపదించారు. సీతారావమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె మృతికి సాహితీ మిత్రులు రావి రంగారావు, లంకిశెట్టి బాలాజీ, భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ తదితరులు సంతాపం తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్‌లు

ఇసుక టిప్పర్లు స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్, జూలై 29 : గండ్రాయి సమీపంలో తెలంగాణాకు ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకుని ఓల్టా కేసు నమోదు చేసినట్టు చిల్లకల్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు. చందర్లపాడు మండలం కొడవటికల్లు గ్రామంలోని ఇసుక యార్డు నుంచి వేదాద్రి గ్రామానికి రెండు టిప్పర్‌లు, అన్నవరానికి ఒక టిప్పర్ వే బిల్లుతో వస్తున్నాయని చెప్పారు. కానీ టిప్పర్‌లు వెళ్లాల్సిన మార్గంలో కాకుండా తిరుమలగిరి మంగొల్లు, గండ్రాయి మీదుగా తెలంగాణ వైపు వెళ్తున్నాయనే సమాచారంతో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

హెచ్ఆర్ఏ కొనసాగింపుపై హర్షం

కృష్ణలంక, జూలై 29 : రాష్ట్ర విభజన అనంతరం అమరావతి రాజధాని ప్రాంతంలో సెక్రటేరియట్, శాఖాధిపతి కార్యాలయాల్లో (హెచ్‌ఓడీ) పనిచేస్తున్న సిబ్బందికి ఇంటి అద్దె అలవెన్సు (హెచ్‌ఆర్‌ఏ) కింద మొదటి ఐదు సంవత్సరాలు 30 శాతం, తర్వాత 24 శాతం బేసిక్ పే గరిష్ఠంగా 25 వేల లోపు ఇచ్చేలా గత పదవ పీఆర్సీ నుంచి ఉత్తర్వులు జూన్ 2025 వరకు అమలులో వుండేలా ఆదేశాలివ్వడంపై జేఏసీ నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టిలు దామోదర్‌రావులు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాల కోరిక మేరకు 2024 జూలై 1 నుంచి 30 జూన్ 2025 వరకు ప్రస్తుతం వున్న 24 శాతం బేసిక్ పే గరిష్ఠంగా రూ.25 వేల లోపు ఇచ్చేలా కొనసాగింపు ఉత్తర్వులు జారీ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఏపీ జేఏసీ అమరావతి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


కాచవరం.. సాగుకు దూరం!

» పాలేటికి చేరని వరద నీరు.. పదివేల ఎకరాల్లో పంట ప్రశ్నార్థకం

» సాగర్ జలాల కోసం రైతన్నల ఎదురుచూపు








జగ్గయ్యపేట రూరల్, జూలై 29 : కాచవరం సప్లై ఛానల్ కింద 10 వేల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బ్రిటీష్ కాలంలో గట్టు కాచవరం గ్రామంలో పాలేటిపై ఆనకట్ట నిర్మించారు. ఆనకట్ట నీరుతో మండలంలోని తక్కెళ్లపాడు, గరికపాడు, బలుసుపాడు, త్రిపురవరం, అనుమంచిపల్లి, షేర్‌మహ్మద్‌పేట, జగ్గయ్యపేట, కె.అగ్రహారం గ్రామాల పరిధిలోని 10 వేలఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందటంతో పాటు ఆయా ప్రాంతాలలోని చెరువులను నింపేవారు. ప్రతీఏటా ఆయకట్టు పరిధిలో జూలై మధ్యలో సాగు ప్రారంభమై ఆగస్టు మొదటి వారంతో పూర్తవుతుంది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసినా పాలేటికి వరద రాలేదు. దీంతో రైతులు పొలాల్లో దుక్కులు దున్నటం కాదు కదా కనీసం నారుమడులు కూడా పోయలేదు. బావులు, బోర్ల కింద అవకాశం ఉన్నవారు నారుమడులు సిద్ధం చేసుకుని నీటికోసం ఎదురు చూస్తున్నారు. మునేరు కింద జోరుగా నారుమడులు, నాట్లు సాగుతున్నా కిందకు నీరు రావటం ఆలస్యమవుతోంది. సాగర్ జలాలు వస్తేనే తమకు నీటి సమస్య తీరుతుందని రైతులు అంటున్నారు.

సాగర్ జలాలు వస్తేనే సాగు..



- కె.శ్రీనివాసరావు, తక్కెళ్లపాడు సర్పంచ్, రైతు

పాలేటిలో నీటి ప్రవాహం సక్రమంగా ఉంటేనే ఈ ప్రాంతంలో సాగు జరుగుతుంది. సాగర్ జలాలు వస్తేనే నీటి సమస్య తీరుతుంది. సాగర్ జలాలు రాకుంటే మెజార్టీ శాతం పంట పొలాలు బీడు భూములుగా మారుతాయి.

రెండో పంటపై ప్రభావం



- యానాల గోపి, కాచవరం సప్లై ఛానల్ మాజీ చైర్మన్, అనుమంచిపల్లి

మొదటి పంట ఆలస్యమైతే ఆ ప్రభావం రెండో పంటపై ఉంటుంది. దీంతో దిగుబడులు తగ్గటంతో పాటు సాగు ఖర్చులు కూడా పెరుగుతాయి. వ్యవసాయ సీజన్‌కు సిద్ధంగా ఉన్న కూలీలు పనులు లేక పక్క మండలాలతో పాటు సరిహద్దులోని తెలంగాణాకు కూలీ పనులకు వెళ్తున్నారు. ఆలస్యంగా నీరు వస్తే రైతులు మూకుమ్మడి పనులు మొదలు పెడతారు. దీని వల్ల కూలీలు, ట్రాక్టర్‌ల లభ్యత ఇబ్బంది ఉండటంతో సాగు ఖర్చులు పెరుగుతాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	104, 113, 124
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

సంక్షేమ పథకాలకు స్ఫూర్తి ప్రదాతల పేర్లు హర్షణీయం

కంకిపాడు, జూలై 29 : స్ఫూర్తి ప్రదాతల పేర్లను సంక్షేమ పథకాలకు పెట్టడం హర్షణీయమని జనసేన పార్టీ ప్రచార కమిటీ ఉమ్మడి కృష్ణాజిల్లా కో- ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు అన్నారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు జాతీయ నాయకులు, స్వతంత్ర సమర యోధుల పేర్లు పెట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారన్నారు. అందుకు అనుగుణంగా జగన్ పేరుతో ఏర్పాటు చేసిన పథకాలకు స్వస్తి పలుకుతున్నట్లు మంత్రి లోకేశ్ ప్రకటించటం హర్షణీయవన్నారు. జగనన్న అమ్మఒడి పథకానికి తల్లికి వందనం, జగనన్న విద్యాకానుకకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర, జగనన్న గోరుముద్దకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా మార్పు చేయడం హర్షణీయన్నారు. ఈ సమావేశంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జీవో నెం 117ను రద్దుచేయాలి



బాపులపాడు ఎంఈవో రాంబాలసింగ్‌కు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

హనుమాన్‌జంక్షన్, జూలై 29 : సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలతో పాటు ఉపాధ్యాయుల మనుగడకు గొడ్డలిపెట్టుగా ఉన్న జీవో నెం 117ను తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రవిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బాపులపాడు ఎంఈవో, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు యూటీఎఫ్ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బాపులపాడు మండల యూటీఎఫ్ నాయకులు నాయకులు పి.జగతి, కె.శ్రీహరి, గంగాధర్, చలపతి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములు స్వాధీనం చేసుకోవాలి

ఉయ్యూరు, జూలై 29 : ఉయ్యూరు, పత్తేలంకలో ఆక్రమణలో ఉన్న వక్ఫ్ భూములు స్వాధీనం చేసుకోవాలని కోరుతూ సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ ప్రకట నలో తెలిపారు. ఉయ్యూరులో 10.56 ఎకరాలు, పమిడిముక్కల మండలం పత్తేలంకలో 32.69 ఎకరాలు ఆక్రమణలో ఉన్న వక్ఫ్ భూములు జీవో నంబరు 18ఎం.డబ్ల్యూ 2014 ప్రకారం వక్ఫ్ భూములు స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

అవయవదానంపై అవగాహన



హనుమాన్‌జంక్షన్, జూలై 29 : అవయవ దానం, శరీరదానం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన చాలా అవసరమని ఏలూరు ప్రభుత్వ వైద్యకళా శాల ప్రొఫెసర్ డాక్టర్ జి. శ్యామల తెలిపారు. మానవత రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు, సూర్య నాగమణి దంపతులు మరణానంతరం వారి శరీరాలను వైద్య విద్యార్థుల అధ్యయనం కోసం ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాలకు దానం చేశారు. సోమవారం దీనికి సంబంధించిన ధ్రువ పత్రాలను స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో డాక్టర్ శ్యామల ద్వారా కాలేజీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మానవత సెంట్రల్ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, ఏలూరు జిల్లా అధ్యక్షులు కనకదుర్గ సభ్యులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు అందించాలి

హనుమాన్‌జంక్షన్, జూలై 29 : వర్షాభావ పరిస్థితులు కారణంగా మెట్ట ప్రాంతాల్లో వరి నాట్లుకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడతున్నారని, సాగర్ జలాలును విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం బాపులపాడు మండల కార్యదర్శి తోట సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నూజివీడు, గన్నవరం, బాపులపాడు మండలాల్లోని మెట్ట ప్రాంతాల్లో బోర్లు కింద వరి సాగు జరుగుతోందని చెరువులను సాగర్ జలాలతో నింపితే భూగర్భ జలాలు మెరుగు పడతాయని తెలిపారు.

నిరుపేదలకు ఉచిత వైద్యం

గన్నవరం, జూలై 29 : నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని గుంటూరు జీజీహెచ్ రిటైర్ ఈఎన్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ బి.కృపాలిన్ తెలిపారు. స్థానిక కంభంపాటి కాంప్లెక్స్‌లో అమృత హెల్త్‌కేర్ హాస్పి టల్‌ను జీవీఎం ఛానల్ అధినేత చల్లపల్లి శ్రీనివాసరావు, జయశ్రీ దంపతులు సోమవారం ప్రారంచారు. ఆయన మాట్లాడుతూ జనరల్ కేసులకు రూ.20, స్పెషలిస్ట్ కేసులకు రూ.100 ఓపీ ఉంటుందని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న బోడె ప్రసాద్

ఉయ్యూరు, జూలై 29 : అసమర్థ, అవినీతి పాలనతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేసిందని, కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతా క్రమంలో కృషి చేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు నగరపంచాయతీ పరిధి పలు వార్డులో నగర పంచాయతీ జనరల్ ఫండ్స్ రూ. 70 లక్షలతో రోడ్డు, డ్రెయినేజీ పనులకు సోమవారం శంకుస్థాపన చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో అవినీతి, అరాచకం రాజ్యమేలగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం ధ్యేయంగా పని చేస్తుందన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీలు ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, వైస్ చైర్మన్ సోలె సురేశ్, మాజీ చైర్మన్లు జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, కౌన్సిలర్లు, పలియాల శ్రీనివాస రావు, సలోమిసంతోషి, టీడీపీ నాయకులు గుర్నాధరావు, అప్పలనాయుడు, నరేశ్, బాబి పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

తుదివరకు కలిసే ప్రయాణం..

పెనమలూరు : రాక్షస, సైకో జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని అంతమొందించి రాష్ట్ర ప్రజలకు ఊపిరులూదిన టీడీపీ, జనసేన పక్షాలు ఎప్పటికీ కలిసే పయనిస్తాయని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జనసేన నాయకులు ముప్పా రాజా, తాతపూడి గణేష్‌లు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి కానూరు జనసేన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. తాడిగడప జనసేన అధ్యక్షుడు తాతపూడి గణేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఇరు పక్షాలు సమన్వయంతో కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. గత టీడీపీ ప్రభుత్వంలో చేయదలచిన పనులను దశల వారీగా పూర్తి చేసి తాడిగడపను ఒక ఆదర్శ మునిసిపాలిటీగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోడె ప్రసాద్‌ను జనసేన శ్రేణులు సన్మానించారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు అన్నపురెడ్డి వెంకటస్వామి, వడ్డి జీవా తదితరులు పాల్గొన్నారు.



రైతుల శిక్షణ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు

వరిసాగుపై రైతులకు శిక్షణ

పెనమలూరు, జూలై 29 : మండలంలోని పెదపులిపాక గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం వారు ఆత్మా వారి సమన్వయంతో రైతులకు వరి సాగుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులననుసరించి సాగు విధానం, భూసార పరీక్షల ప్రకారం ఎరువుల వాడకం , వెద, నాటు పద్ధతుల్లో వరి పొలాల్లో సమగ్ర కలుపు యాజమాన్యం, ఎలుకల యాజమాన్యం, గ్రామీణ విత్తనోత్పత్తి పథకం క్రింద రైతులు పాలించాల్సిన పద్ధతుల గురించి శిక్షణా కార్యక్రమంలో చర్చించారు. రైతులనుద్దేశించి జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు కలుపు మందులు వేసేటప్పుడు రెండు మూడు కలుపు మందులను కలిపి వాడకూడదని తెలిపారు. కార్యక్రమంలో ఏఓలు శైలజ, పద్మజ పాల్గొన్నారు.

ప్రత్యేక నిఘా బృందంతో ఇసుక తోడేళ్లకు చెక్

ఉయ్యూరు ఆర్డీఓ రాజు

పెనమలూరు, జూలై 29 : ప్రత్యేక నిఘా బృందంతో చోడవరం నుంచి యనమలకుదురు వరకు జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలకు చెక్ పెడుతున్నట్లు ఉయ్యూరు ఆర్డీఓ రాజు తెలిపారు. రెవెన్యూ నుంచి ముగ్గురు వీఆర్వోలు, పోలీసు శాఖ నుంచి ఇద్దరు, పంచాయతీరాజ్ శాఖల నుంచి మరికొంతమంది సిబ్బందితో టీంలను ఏర్పాటు చేసి ఇసుక అక్రమార్కులపై నిరంతరం పర్యవేక్షణచేయనున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా ఇసుక తోలేవారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. అక్రమ ఇసుక రవాణాదారుల వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీగా జరిమానాలు విధించి వాహనాల సొంతదారులపై క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు.

పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలి



హెల్త్ క్యాంపెయిన్‌లో టీ కప్పులు పంపిణీ చేసిన ప్రతినిధులు

పెనమలూరు, జూలై 29 : పొగాకు వినియోగంవల్ల కలిగే విషపూరిత ప్రభావాలను ప్రజలకు వివరించేందుకు, ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించడానికి 'హావ్‌మోర్ టీ' 'నేమోర్ పఫ్స్' అనే పేరుతో ఆసక్తికరమైన ఇంటరాక్టివ్ కార్యక్రమాన్ని విజయవాడ హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ ప్రతినిధులు నిర్వహించారు. సోమవారం తాడిగడప సమీపంలో జరిగిన కార్యక్రమంలో టీ స్టాల్స్‌లో టీ, సిగరెట్‌లు తాగడానికి గుమికూడే వినియోగదారులకు ఈ నినాదంతో హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటరు ప్రతినిధులు టీ కప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌సీజీ సిటీ క్యాన్సర్ సెంటర్ కన్సల్టెంట్ అంకాలజిస్టు డాక్టర్ సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రజలకు విస్తృతంగా తెలియజేసేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గంగానమ్మకు ఆషాఢం సారె



గారపాడులో గంగానమ్మకు ఆషాఢం సారె సమర్పించేందుకు ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఉంగుటూరు, జూలై 29 : సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని గారపాడు, వెన్నూతల గ్రామాల్లో గ్రామదేవత గంగానమ్మకు భక్తులు ఆషాఢమాసం సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు, పట్టుచీరలు, పూలు, పండ్లు, వివిధరకాల పిండివంటలు, పొంగళ్లతో డప్పు వాయిద్యాలతో గ్రామప్రధాన వీధులగుండా ఊరేగింపుగా బయలుదేరిన భక్తులు అమ్మవారి నామస్మరణచేస్తూ గ్రామసమీపంలోని గంగానమ్మ గుడివద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆషాఢసారె సమర్పించారు. ఈసందర్భంగా ఎస్ఎస్ఎఫ్ సబ్‌డివిజన్ ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు మాట్లాడుతూ ఆధునిక జీవనవిధానంలో నిత్యం మనిషి ఎదుర్కొనే మానసిక సంఘర్షణలు, ఒత్తిడిలను దూరంచేసి ప్రశాంతతను కల్పించేందుకు, ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక, ధార్మిక చింతన పెంపొందించి తద్వారా సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు సమరసత సేవా ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ మండల సహకన్వీనర్ పడమట అర్జునరావు, గ్రామకన్వీనర్ తేలు సత్యనారాయణ, గ్రామపెద్దలు పాతూరు బాబూజీ, గుత్తా పూర్ణచంద్రరావు, మహిళా కమిటీ బృందం పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

ఉయ్యూరు, జూలై 29 : రాష్ట్రవ్యాప్తంగా రేషన్‌డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్‌కు సోమవారం రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాగిత కొండ ఆధ్వర్యంలో సోమవారం రేషన్ డీలర్లు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా కమిషన్‌తో పాటు రూ. 5వేలు గౌరవవేతనం సదుపాయం ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయాలని, గత ప్రభుత్వం రేషన్ డీలర్ల దగ్గర సేకరించిన ఖాళీ సంచులకు నగదు ఇప్పించాలని, నిత్యావసర వస్తువులకు అప్పు సౌకర్యం కల్పించడంతో పాటు ఇతర డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని కోరినట్లు కొండ తెలిపారు. రేషన్ డీలర్లు రెడ్డిరమణ, ఏసు బాబు, పణి, వీరప్ప, వెంకటేశ్వరరావు, శ్రీదేవి, రవికుమార్ తదితరులు రాజేంద్రప్రసాద్‌ను కలసిన వారిలో ఉన్నారు.

పదోన్నతులు కల్పించాలి

మున్సిపల్ మంత్రి నారాయణకు సచివాలయ ఉద్యోగుల వినతి



మంత్రి నారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సచివాలయాల ఉద్యోగులు

ఉయ్యూరు, జూలై 29 : ఆంధ్రప్రదేశ్ వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ శాఖ మంత్రి పొంగూరి నారాయణను సోమవారం సెక్రటరియేట్‌లో కలసి సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, సహాధ్యక్షులు దడాల జగ్గారావు, పిల్లి హరీశ్ తెలిపారు. వార్డు సచివాలయాల్లో సంవత్సరాల తరబడి సక్రమంగా విధులు నిర్వహిస్తున్నామని, ఉద్యోగంలో ఎదుగు బొదుగు లేకుండా సంవత్సరాల తరబడి పనిచేస్తున్న మాకు ప్రమోషన్లు కల్పించాల్సిందిగా కోరినట్టు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎం. రవికుమార్, సంయుక్త కార్యదర్శి భవాని, ఉపాధ్యక్షులు వేణు మణికంఠ, ఆదిల్, నవీన్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

పౌష్టికాహారంతోనే ఏకాగ్రత



తాడిగడప ఉన్నత పాఠశాలలో..

ఈడుపుగల్లు (కంకిపాడు), జూలై 29 : విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని విద్యాశాఖ అధికారులను మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ఆయన పండ్లు పంపిణీ చేశారు. అదే విధంగా దేవినేని రాజా తండ్రి గంగాధర్‌రావు జ్ఞాపకార్థం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, టీడీపీ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్, స్థానిక వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : మండల పరిధిలోని గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ, దాతల సహకారంతో సోమవారం విద్యార్థులకు సహపంక్తి భోజనాలు (శుభదిన్ భోజన్) నిర్వహించారు. ఉయ్యూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నర్రా సుధారాణి, అన్నే రాణి విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసి సహపంక్తి భోజనం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, జ్యోత్స్నదేవి, విద్యాకమిటీ చైర్మన్ తుమ్మల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కడవకొల్లు ప్రాథమికోన్నత పాఠశాలలో శుభదిన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు.



ఉయ్యూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

పెనమలూరు : జాతీయ విద్యావిధానం అమలు నేపథ్యంలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం తాడిగడప ఉన్నత పాఠశాలలో శుభదిన్ భోజన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల తెలుగు విభాగం ఉపాధ్యాయురాలు మాగంటి అనిత కుమారుడు ప్రణీత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాలలోని విద్యార్థులందరికీ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంతో పాటు పలురకాల స్వీట్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గన్నవరం : మండలంలోని పాఠశాలలో శుభదిన్ భోజనాలు ఘనంగా జరిగాయి. సోమవారం మధ్యాహ్న భోజనంలో మెనూతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంలో శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుభదిన్ భోజనాలు జరిగాయి. రోజూ తినే భోజనాలతో



వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో..

పాటు వెరైటీ వంటకాలు చేసి విద్యార్థులకు పెట్టారు. కేసరపల్లి శివారు సుందరయ్య నగర్‌లో ఎంఈవో-1 కొండా రవికుమార్, ఎంఈవో-2 కమల పాల్గొని తిధి భోజనాల విశిష్టతను వివరించారు. వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి పాల్గొన్నారు. దావాజీగూడెంలో ఎంపీపీ పాఠశాలలో బూతిల్లిపాడు తులీప్ గార్డెన్ ప్రతినిధులు ఆహార పదార్థాలను స్పాన్సర్ చేశారు. హెచ్ఎం జె.కుమారి పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యం కోసం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడిభోజనం పథకం ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తుంటే శుభదిన్‌భోజన్ ద్వారా దాతలు పండ్లు



ఈడుపుగల్లులో పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ దేవినేని రాజా

అందించడం అభినందనీయమని ఎంఈఓ సురేష్‌కుమార్ అన్నారు. వీరవల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకం ద్వారా అందిస్తున్న భోజనాన్ని దాతలతో కలిసి సోమవారం ఆయన రుచి చూశారు. దాతలు గుండపనేని ఉమావరప్రసాద్, ఉపాధ్యాయుడు రమణగోపాల్ విద్యార్థులకు అందజేసిన చక్రపొంగలి, అరటిపండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లా అనిత, ఉప సర్పంచ్ లంక అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న డొక్కా సీతమ్మ బడి భోజనంలో ప్రతి సోమవారం నిర్వహించే శుభదిన్ భోజన్ కార్యక్రమానికి దాతలు సహకారం అందించాలని బాపులపాడు ఎంఈవో రాంబాలసింగ్ పిలుపునిచ్చారు. బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో ఆ పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్ చంద్రబోస్ పాఠశాలలోని 460 మంది విద్యార్థులకు రవ్వ కేసర స్వీట్, అరటి పండ్లు అందజేశారు. బాపులపాడు ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు ఎంఈవో-2 బట్టు సురేష్‌కుమార్ స్వీట్లు, పండ్లు ఏర్పాటు చేసి వడ్డించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె. రత్నకుమారి పాల్గొన్నారు.

ఉంగుటూరు : మండలంలోని తేలప్రోలు జడ్పీ హైస్కూల్‌లో శిక్షా సప్తాహ్ ముగింపు రోజున యథావిధిగా అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంతోపాటు దాతల సహకారంతో విద్యార్థులకు ప్రత్యేకంగా బిర్యానీ, పులిహోర, స్వీట్లు వంటి పలురకాల ఆహార పదార్థాలను అదనంగా వడ్డించారు.



శుభదిన్ భోజనం చేస్తున్న ఎంఈవో, స్థానిక నేతలు

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	104, 113, 124
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.80

సైనికుడు నాగరాజు కుటుంబానికి వేదవ్యాస్ పరామర్శ



పెడన రూరల్ : వీర మరణం పొందిన సైనికుడు సాదరబోయిన నాగరాజు కుటుంబ సభ్యులను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ సోమవారం పరామర్శించారు. చేవేంద్రలోని వారి ఇంటికివెళ్లి నాగరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. తండ్రి వెంకన్నను, తమ్ముడు శివ, నాగరాజు భార్యా మంగాదేవిలను ఓదార్చారు. ప్రభుత్వం నుంచి ఏవిధమైన సహాయం అందలేదని వెంకన్న చెప్పగా, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సహాయానికి కృషి చేస్తానన్నారు. గరికపాటి వీరవెంకట్రావు, పుప్పాల నరశింహరావు, యర్రంశెట్టి సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.



పలుగుల గండి వద్ద గుండేరు డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ



మోపిదేవి అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్



కాలేఖాన్‌పేట హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో

డ్రెయిన్ల పనులు పక్కాగా చేయాలి

రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలి : అధికారులకు కలెక్టర్ ఆదేశం

చల్లపల్లి/ఘంటసాల, జూలై 29 : గుండేరు మేజర్ డ్రెయిన్, అందులో కలిసే మైనర్ డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూటు తొలగింపునకు ప్రభుత్వం రూ.75 లక్షలు మంజూరు చేసిందని, పనులు పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురం, మాజేరు వద్ద గుండేరు మేజర్ డ్రెయిన్‌ను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. గుర్రపు డెక్క, తూటుకాడ తొలగింపు పనులు ఎంత వరకు వచ్చాయో ఆరా తీశారు. జీలగలగండి వద్ద ఐనంపూడి డ్రెయిన్‌ను పరిశీలించారు. డ్రెయిన్‌లో కిక్కిస ఎక్కువగా వ్యాపించి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటోందనీ, దీని నిర్వహణకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించినట్లు అధికారులు చెప్పారు. ఘంటసాల మండల పరిధిలోని కొడాలి, ఘంటసాలపాలెం, దేవరకోట, బిరుదుగడ్డ, దాలిపర్రు వద్ద పలుగుల గండి వద్ద గుండేరు డ్రెయిన్‌లలో గుర్రపు డెక్క పనులను అధికారులు చేపట్టగా, పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. తొలగింపు పనులు పక్కాగా నిర్వహించాలని, రైతులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. ఇరిగేషన్ డీఈఈ రావెళ్ల రవికిరణ్, డ్రైనేజీ ఇన్‌ఛార్జి డీఈఈ పి.వెంకటేశ్వరరావు, అధికారులు, రైతులు కలెక్టర్‌తో ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

మోపిదేవి : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న పాలు, పోషకాహారాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం రిజిస్టర్లు పరిశీలించారు. సకాలంలో చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి వివరాలు నమోదు చేయాల్సిందిగా సూచించారు.

మీకోసంలో అర్జీల స్వీకారం

అవనిగడ్డ : అవనిగడ్డలో సోమవారం కలెక్టర్ డీకే బాలాజీ మీ కోసం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 22ఏ నిషేధిత భూముల జాబితాలో ఇళ్ల స్థలాలను చేర్చటంతో అవనిగడ్డలో కొనుగోళ్లు, అమ్మకాలు నిలిచిపోయాయని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మోపిదేవిలో లే అవుట్-3లో జరిగిన అక్రమాలపై విచారణ నిర్వహించాలని, మౌలిక వసతులు లేవని పేదలు తెలిపారు. కలెక్టర్ ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడి మోపిదేవి లేవుట్-3లో పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని ఆదేశించారు. అవనిగడ్డ డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలని జనసేన నేత గుడివాక శేషుబాబు అర్జీ సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మీ కోసం కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని, ఇకపై ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు కలెక్టర్ లేదా జాయింట్ కలెక్టర్ ప్రతి సోమవారం ఒక్కో నియోజకవర్గంలో అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

గౌరవ వేతనం కోసం బీఎల్వోల వినతి

అవనిగడ్డ రూరల్ : గత మూడు సంవత్సరాలుగా గౌరవ వేతనం లేక ఇబ్బందులు పడుతున్నామని అవనిగడ్డ నియోజకవర్గ బీఎల్వోలు కలెక్టర్ డీకే బాలాజీని కలిసి విన్నవించారు. ఆఫీసు పనులు ఎన్ని ఉన్నప్పటికీ, వేరే చోట డ్యూటీ వేసినప్పటికీ సొంత ఖర్చులు భరించి మరీ విధులు నిర్వహించామని, కనీసం జీతం అడుగుతుంటే తహసీల్దార్ కార్యాలయం నుంచి సమాధానం చెప్పటం లేదని కలెక్టర్‌కు తెలిపారు. స్పందించిన కలెక్టర్ అవసరమైతే ఎన్నికల ప్రధాన అధికారితో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆది అశోక్, కడవకొల్లు నవీన్, తోట జాహ్నవి, నాగార్జున, మహేష్, బీఎల్వో పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

మచిలీపట్నం టౌన్ : నాణ్యత, రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని డీఈవో తాహెరా సుల్తానా అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కాలేఖాన్‌పేట మునిసిపల్ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి డీఈవో తాహెరా సుల్తానా, ఏడీ మనోహరనాయక్, డీవైఈవో శేఖర్‌సింగ్, ఎంఈవో దుర్గాప్రసాద్, వై.ఎస్.ఆర్.కె. గురుప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి భోజనం చేశారు. పాఠశాలలో ఆరోగ్యకరమైన వాతావరణం ఉంచాలని, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

పశువుల చావిడి దగ్ధం..మూడు గేదెలు మృతి

కోడూరు : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పశువుల చావిడి దగ్ధమై మూడు గేదెలు మృతి చెందిన సంఘటన కోడూరు ఒకటో వార్డులో జరిగింది. కోట రాంబాబు పశువుల చావిడిలో సోమవారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగి మూడు గేదెలు మృతి చెందాయి. మంటలను గమనించిన రాంబాబు ఒక గేదెను సురక్షితంగా బయటకు పంపారు. మృతి చెందిన గేదెల విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని రాంబాబు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

15 రోజులుగా ఆచూకీ లేని వివాహిత



తోట్లవల్లూరు : భర్తతో మనస్పర్థలతో పుట్టింటికి వచ్చిన వివాహిత కన్పించడం లేదని ఫిర్యాదు అందినట్లు ఎస్సై పి.విశ్వనాథ్ తెలిపారు. తోట్లవల్లూరుకు చెందిన మల్లీశ్వరికి ఉయ్యూరు మండలం గండిగుంటకు చెందిన సురేష్‌తో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. భర్త సురేష్‌తో మనస్పర్థల కారణంగా ఐదు నెలలుగా తోట్లవల్లూరులో పుట్టింటి వద్ద ఉంటోంది. ఈ నెల 15వ తేదీ రాత్రి 11.50 గంటల సమయంలో అందరూ నిద్రిస్తుండగా మల్లీశ్వరి ఇంటి నుంచి వెళ్లిపోయిందని, ఇప్పటి వరకు అన్ని చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదని తల్లి గొల్లపల్లి కృపాబాయమ్మ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

సిరివెళ్లపాలెం రేషన్ షాపు సీజ్

మచిలీపట్నం టౌన్ : బందరు మండలం సిరివెళ్లపాలెంలోని నెం.48 రేషన్‌షాపును సోమవారం సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీ చేశారు. బియ్యంలో వ్యత్యాసాన్ని కనుగొన్నారు. 32 బియ్యం బస్తాలు తగ్గినట్టు తేలింది. ఎటువంటి అనుమతులు లేకుండా రేషన్‌షాపును పంచాయతీ కార్యాలయంలో నిర్వహించడాన్ని అధికారులు తప్పుపట్టారు. రేషన్ షాపు డీలరు పేరుబోయిన నాగలక్ష్మిని వివరణ కోరారు. షాపును సీజ్ చేశారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గుడివాడ : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు, ఫోన్ నెంబర్ల నుంచి వచ్చిన మెసేజ్‌లు, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కానీ వచ్చిన లింకులను క్లిక్ చేయవద్దని డీఎస్పీ శ్రీకాంత్ ఒక ప్రకటనలో సూచించారు. ఫోన్‌లకు వచ్చిన ఓ.టి.పి, ఆధార్, పాన్, బ్యాంకు అకౌంట్ వివరాలను ఎవరికి తెలుపవద్దన్నారు. ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా డబ్బులను తీసుకోవద్దన్నారు. పోలీస్ వారమని పరిచయం చేసుకుని పార్శిల్ వచ్చిందని, అందులో డ్రగ్స్ ఉన్నాయని నమ్మబలుకుతున్నారన్నారని, కేసు లేకుండా చేయాలంటే డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న సంఘటన ఎదురైతే వెంటనే టోల్ ఫ్రీ నెం.1930కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని డీఎస్పీ కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు

తోట్లవల్లూరు : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ని సోమవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై పి విశ్వనాథ్ తెలిపారు. మానికొండకు చెందిన వెంట్రప్రగడ సురేంద్ర, సగ్గుర్తి రవీంద్ర వల్లూరుపాలెం నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తీసుకువెళుతుండగా దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు.

ఆదినారాయణకు కొనకళ్ల పరామర్శ

కోడూరు : పితృ వియోగానికి గురైన జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు సోమవారం పరామర్శించారు. పిట్టలంకలోని ఆదినారాయణ నివాసంలో సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు మర్రే గంగయ్య, వెంకట కృష్ణారావు, మాచవరపు అశోక్, మట్టా రాధాకృష్ణ, కోనపురెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో స్కానింగ్ కేంద్రాల తనిఖీ

మచిలీపట్నం టౌన్ : చట్టరీత్యా స్కానింగ్ కేంద్రాలను తప్పనిసరిగా రిజిష్టర్ చేయించుకోవాలని, లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి గీతాబాయి అన్నారు. మచిలీపట్నంలోని ఉత్తమ్, సాయిశ్రీరామ్ స్కానింగ్ కేంద్రాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. గీతాబాయి మాట్లాడుతూ, లింగనిర్ధారణ నిషేధ చట్టాన్ని ఉల్లంఘించినట్టయితే చట్ట రీత్యా చర్యలు తప్పవన్నారు. ఐఎంఏ గుర్తింపును కూడా రద్దు చేస్తామన్నారు. ప్రతి గర్భవతి వివరాలను ఫారం ఎఫ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. గర్భిణులు, ఆరోగ్య విద్యబోధకుడు బి. రాజేంద్రకుమార్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు

బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలి


మచిలీపట్నం టౌన్ : బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ బాలిక హాస్టల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఏఎస్పీ వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పేద బాలికలకు ఉచితంగా హాస్టల్‌ను నిర్వహిచడం ముదావహమన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పి. శ్రీరామ్ అధ్యక్షత వహించారు. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, పేద బాలికలను ఆదుకునేందుకు దాతలు, విద్యావేత్తలు నిత్యావసర వస్తువులు, పుస్తకాలు అందజేయాలన్నారు. తూమాటి సురేష్ మాట్లాడుతూ, తన వంతుగా బాలికలకు సాయం అందిస్తామన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పి. సాయికృష్ణ, పి.వి. ఫణికుమార్, కారుమూరి రాజేంద్రప్రసాద్, కానుకొలను ఫణికిరణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

ఆటో డ్రైవర్ల పిల్లలకు ప్రోత్సాహకాలు : డీఎస్పీ

గుడివాడ : మత్తు పదార్థాల మహమ్మారిని తరిమికొట్టాలని, దీనికి ప్రజల్లో చైతన్యం చాలా అవసరమని డీఎస్పీ పి.శ్రీకాంత్ అన్నారు. ఎన్‌జీవోస్ హోం ఆటో డ్రైవర్‌లకు ట్రాఫిక్ నిబంధనలు, మత్తు పదార్థాల వినియోగం వలన జరిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. క్రమశిక్షణతో ఆటో నడుపుకుంటూ కష్టపడి పిల్లలను చదివిస్తున్న డ్రైవర్‌లను ప్రోత్సహించేందుకు నగదు పురస్కారాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో బీటెక్ మొదటి సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఆటో డ్రైవర్ల పిల్లలకు పోలీస్ శాఖ నుంచి రూ.5 వేలు చొప్పున నగదు ప్రోత్సహకాలను అందజేశారు. పట్టణ సీఐలు ఎల్.రమేష్, నాగదుర్గారావు, ట్రాఫిక్ ఏఎస్సై రత్నరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి

గుడ్లవల్లేరు : విద్యార్థులు లక్ష్య సాధన దిశగా నిరంతరం శ్రమించాలని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ అన్నారు. మొదటి సంవత్సర విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రేరణా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ ప్రసంగించారు. సీనియర్ విద్యార్థులచే విజ్ఞాన, సాంకేతిక నైపుణ్యాలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండరామారావు, ఎం.ఆర్.సి హెచ్.శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో పవిత్రోత్సవాల ముగింపు

మోపిదేవి, జూలై 29 : మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పవిత్రోత్సవాలు మూడో రోజైన సోమవారం పూర్ణాహుతితో వైభవంగా ముగిశాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామివారికి గోపూజ, నిత్యార్చన, సుబ్రహ్మణ్య మూల మంత్ర అనుష్టానాలు, హవనము, పవిత్ర జల ప్రోక్షణ శాస్త్రోక్తంగా జరిపారు. వేదపండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు మహాపూర్ణాహుతి నిర్వహించారు. ప్రధాన అర్చకులు బుద్ధు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు వేద ఆశీర్వచనలు చేశారు. ఆలయ ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



నేడు ఆషాఢ కృత్తికా మహోత్సవం

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి జన్మనక్షత్రం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి ఆషాఢ కృత్తికా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఆషాడ కృత్తిక సందర్భంగా శ్రీ వల్లీ దేవ సేన అమ్మ వార్లకు శాకంబరీ అలంకరణ, స్వామివార్లకు 108 కలశాలతో అష్టోత్తర కలశాభిషేకం, లక్ష బిల్వార్చన వంటి విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు తెలిపారు.

బదిలీ తహసీల్దార్లకు సత్కారం

ఘంటసాల, జూలై 29 : బదిలీపై పశ్చిమ గోదావరి జిల్లా వెళ్తున్న సందర్భంగా ఘంటసాల తహసీల్దార్ ఎన్.బి.విజయలక్ష్మిని వీఆర్వోలు, రెవెన్యూ ఉద్యోగులు సోమవారం ఘనంగా సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ చప్పిడి చిట్టిబాబు, వీఆర్వోలు కర్రా నాగరాజు, నాగేశ్వరరావు, రవి కుమార్, కె.సాయిబాబు, మనీష్, నాగమల్లేశ్వరి, యువరాజ్, ప్రసాద్, రీ సర్వే డిటి శ్రీనివాస్, మండల సర్వేయర్ వల్లి, పుష్ప, వీఆర్ఏలు పాల్గొన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా చప్పిడి చిట్టిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. **పెడన/పెడనరూరల్ :** పెడన తహసీల్దార్ ఆర్. రాంబాబు భీమవరం జిల్లాకు బదిలీ అయ్యారు. కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. డిప్యూటీ తహసీల్దార్ కాగిత పూర్ణచంద్రరావును ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. ఆర్ఐ మణికుమార్, వీఆర్వోలు గోవిందు, షాకీరుల్లా, యోధా, ప్రసాద్, వీరభద్రం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కూచిపూడి :** మొవ్వ తహసీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు బదిలీ అయ్యారు. మొవ్వలో డిప్యూటీ తహసీల్దార్ సిహెచ్.గోపాలరావుకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించి ఆమె రిలీవ్ అయ్యారు. ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. **పెదపారుపూడి :** బదిలీపై తూర్పు గోదావరి జిల్లాకు వెళ్తున్న తహసీల్దార్ వెంకట మాధవరావును రెవెన్యూ సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. వీఆర్వోలు భగవంతురావు, ప్రసాద్, దానియేలు, వీఆర్ఏలు చుక్కమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** తహసీల్దార్ టి.శ్రీనివాసరావు అల్లూరు సీతారామరాజు జిల్లాకు బదిలీ అయ్యారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ పద్మప్రియ బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఆర్ఐ సుభాషిణి, వీఆర్వో కొండలు, ఇమ్రాన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఘంటసాలలో విజయలక్ష్మి, కోడూరులో శ్రీనివాసరావులను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది



వెంకట మాధవరావు దంపతులకు సత్కారం

బాధితుడికి విక్కుర్తి ఆర్థిక సాయం



మోపిదేవి : కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పెదప్రోలు గ్రామానికి చెందిన కాకర్లమూడి రాజేష్ కుటుంబానికి ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ రూ.10 వేల ఆర్థిక సాయమం దించారు. సోమవారం రాజేష్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చు లు, కుటుంబ ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు సహాయం కుటుంబసభ్యులకు అందజేశారు. విక్కుర్తి రాంబాబు, పులిగడ్డ చంద్ర, పున్నయ్య చౌదరి, బర్మా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బీసీ భవనాలు నిర్మించాలి : లకనం

అవనిగడ్డ : నియోజకవర్గంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకోవటానికి బీసీ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని బీసీ నేత, టీడీపీ జిల్లా కార్యదర్శి లకనం నాగాం జనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవనిగడ్డలోని మత్స్య భవనం వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు మండలాల్లో ఆరు బీసీ భవనాలను గతంలోనే మండలి బుద్ధ ప్రసాద్ మంజూరు చేయించారన్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఈ భవనాల నిర్మాణానికి నోచుకోలేదన్నారు. బీసీ భవనాల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కమిషనర్‌కు ఐదు అర్జీలు

పెడన : పెడన మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ బి. వెంకట్రామయ్య అర్జీలు స్వీకరించారు. పెన్షన్ మంజూరు కోరుతూ ఒకటి, కుక్కల బెడద తొలగించాలని ఒకటి, శానిటేషన్ మెరుగు పరచాలని మూడు అర్జీలు వచ్చాయి. టీపీవో ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఆశ్రమ హాస్టల్‌కు రాయపూడి ఫ్యాన్ల వితరణ

మోపిదేవి : మోపిదేవిలోని బీసీ ఆశ్రమ హాస్టల్‌కు జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు రెండు ఫ్యాన్లను అందజేశారు. ఫ్యాన్లను హాస్టల్ వార్డెన్ లంకేశ్వరరావు, విద్యార్థులకు అందజేశారు. జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు భోగిరెడ్డి సాంబశివరావు, మెరకనపల్లి నరేష్, లోలాక్షుడు, నాగేంద్ర, ఏడుకొండలు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం

పెడన : చేనేత కార్మికుల సమస్యలపై ఏపీ చేనేత కార్మిక సంఘం (ఏఐటీయుసీ అనుబంధ సంస్థ) నాయకులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మొత్తం 17 సమస్యలను ప్రస్తావించి, పరిష్కరించాలని వారు వినతిపత్రంలో కోరారు. కట్టా హేమసుందరరావు, మోదుమూడి రామారావు, బూసం బాలసుబ్రహ్మణ్యం, కుర్మా విఘ్నేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు

మచిలీపట్నం టౌన్ : బచ్చుపేటలో వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు మంగళవారం నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.ఎస్. చక్రధరరావు తెలిపారు. మంగళవారం వాస్తుపూజ, అంకురారోపణ, బుధవారం నవగ్రహారాధన, హోమాలు, లక్ష్మీయజ్ఞం, గురువారం విష్వక్సేన పూజ, శాంతిహోమం జరుగుతాయన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారన్నారు. ఆలయ ఛైర్మన్ ముత్తేవి రవికాంత్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో భక్తులు పాల్గొని తరించాల్సిందిగా ఈవో చక్రధరరావు కోరారు.

కంప్యూటర్ పరిజ్ఞానంపై వాసవీలో అవగాహన సదస్సు

పెడన రూరల్ : నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ పరిజ్ఞానంపై అఖిలభారత సాంకేతిక విద్యాశాఖ ప్రొఫెసర్ ఎం. కిషోర్‌కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సూపర్ కంప్యూటర్ ద్వారా క్లిష్టమైన సమస్యలను ఎలా పరిష్కరించాలో విపులీకరించారు. అనంతరం కళాశాల యాజమాన్యం కిషోర్‌కుమార్‌ను సన్మానించారు. కరస్పాం డెంట్ కాకి కుమార్‌బాబు, డైరక్టర్ దోపాటి బాబా, ప్రిన్సిపాల్ బిఆర్‌ఎస్ రెడ్డి, షేక్ ఖాదర్ జిలాని, శ్రీధర్ పాల్గొన్నారు.

మోటూరు విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

గుడివాడ రూరల్ : మోటూరు విద్యుత్ సమస్య లు పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు ఎంపీడీవో కె.జ్యోతికి వినతిపత్రం అందజేశారు. మోటూరు, బీసీ కాలనీల్లో ప్రతిరోజు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని, డీఈ, ఏఈలకు తెలిపినా పట్టించుకోవటం లేదన్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎంపీడీవో స్పందించి సమస్యను పరిష్కరించటానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు సాయం

పమిడిముక్కల : గుర్రాలంకలో అగ్నిప్రమాద కుటుంబాలకు ఎస్సై కె.శ్రీనివాస్ బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బాధితులకు తాత్కాలిక నివాసం కొరకు టార్పాలిన్, వంట పాత్రలు, సబ్బులు, పేస్టులతో కూడిన హైజనిక్ కిట్ అందజేశారు. సొసైటీ ఛైర్మన్ తోట బాలాజీ, సెక్రటరీ భవిరి శంకర్‌నాథ్, హరికృష్ణ, డిప్యూటీ తహసిల్దార్ జోబాబు, బొల్లా గోపి, హైస్కూల్ పీడీ ఈవి సత్యనారాయణ, వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.